క్లుప్తంగా

23 బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబు అవుతున్న ఆలయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తిమ్మాపూర్ అటవీలో కొలువైన బంగారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 23న ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. అటవీలో చెట్టు కింద స్వయంబుగా కొలువైన బంగారమ్మతల్లికి దాతల సహాయంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ నెల 21న పచ్చని పందిల్లు, 22న అమ్మవారి విగ్రహ ఊరేగింపు, 23న బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు కోళాపల్లి టోల్‌గేట్ వద్ద వైద్యశిబిరం

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా మండలంలోని కోళాపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం మధ్యాహ్నం2 గంటలకు రోడ్డు భద్రతపై అవగాహన,రక్తదానం శిబిరం, హెల్త్ చెకప్ క్యాంపు, కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు కేఎస్ఆర్ పేట ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, మెదక్ డీఎస్పీ సైదులు, ఆర్‌ఈ విజయ్‌కుమార్‌లు హాజరవుతారన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

దుకాణాలను తనిఖీ

రేగోడ్(మెదక్): మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గాలి పటాలను ఎగురవేశారు. ఆయా దుకాణాలను స్థానిక ఎస్ఐ సత్యనారాయణ తనిఖీ చేశారు. చైనా మంజా వాడకూడదని, దుకాణ యజమానులను ఆదేశించారు. చైనా మాంజా పక్షుల రెక్కలకు తగిలి చనిపోయే ప్రమాదముందని చెప్పారు.

నేడు రంగంపేటకు ఎమ్మెల్యే రాక

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రానున్నట్లు సర్పంచ్ సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సౌజన్యంతో నిర్వహించిన రంగంపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఆర్థిక సాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలో ఇటీవల బేస్త లక్ష్మణ్ కుమారుడు నరేశ్ మృతి చెందాడు. దీంతో సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్ బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి, రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య అరవింద్‌లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి

చేగుంట(తూప్రాన్): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని చేగుంట మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈశ్వర్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈశ్వర్‌కుమార్ చేగుంటతో పాటు ఇటీవల ప్రారంభించబడిన తూప్రాన్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను స్వీకరిస్తున్నారు. సోమవారం ఎంపీని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి, రెండు మార్కెట్ కమిటీల పాలన పరమైన అంశాలను ఎంపీకి వివరించారు. అలాగే కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రామాయపల్లిలో శతాధిక వృద్ధురాలు మృతి



పోచమ్మ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రామాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామాయపల్లికి చెందిన జక్కుల పోచమ్మ (102) సంవత్సరాలు జీవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా సోమవారం వయోభారంతో పోచమ్మ మృతి చెందినట్లు చెప్పారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కూతురుండగా వీరిలో గతంలోనే పెద్ద కుమారుడు, కూతురు చనిపోయారు.

గ్రామీణ క్రీడాకారులు రాణించాలి

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట, ఎల్లారెడ్డిపేట, గుడికందుల గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. లింగంపేటలో క్రికెట్ పోటీలను సర్పంచ్ రేణుకా నర్సింలు, ఎల్లారెడ్డిపేటలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య, గుడికందలలో పీఏసీఎస్ మాజీ కార్యదర్శి హన్మాండ్లకాడి కిష్టారెడ్డిల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం సంక్రాంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. అన్ని గ్రామాల్లో ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. అలాగే రకరకాల పిండి వంటలు చేశారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. పలు గ్రామాల్లో మహిళలకు నాయకులు, ప్రజాప్రతినిధులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.



కాడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళలు



కొల్చారం(నర్సాపూర్): ముగ్గు వద్ద చిన్నారులు



ఇస్లాంపూర్‌లోని రామలింగేశ్వర ఆలయం వద్ద స్వామివారికి బండ్లను ఊరేగిస్తున్న భక్తులు



చిన్నశంకరంపేట(మెదక్): గవ్వలపల్లిలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు



శివ్వంపేట(నర్సాపూర్): పూజలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి



కాడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో..



కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో..



శివ్వంపేట(నర్సాపూర్): గూడూర్‌లో ..



పెద్దశంకరంపేట(మెదక్): పేటలో..



రామాయంపేట(మెదక్): పట్టణంలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో ..

భక్తులతో కిటకిటలాడిన రామలింగేశ్వరాలయం



ఆలయంలో పూజలు చేస్తున్న రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్: డివిజన్ పరిధిలో సంక్రాంతి పండగ సందర్భంగా సందడి నెలకొంది. మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల్లో భాగంగా రెండో రోజు ఉత్సవాలు కొనసాగుతున్నాయి.సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం,దేవతామూర్తులకు అభి షేకం, గోపాల కాల్వలు, ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరకు జిల్లా నలుమూలల నుంచి, ఇతర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వయంబు రామలింగేశ్వరస్వామి

కంటి వెలుగుకు సన్నద్ధం కావాలి



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఆరోగ్య పర్యవేక్షణ అధికారి నిర్మల



మనోహరాబాద్(తూప్రాన్): అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

చిన్నశంకరంపేట(మెదక్): కంటి వెలుగు కార్యక్రమానికి సన్నద్ధం కావాలని మండల కంటి వెలుగు టీమ్ సూపర్‌వైజర్ నిర్మల కోరారు. సోమవారం మండలంలోని సూరారం గ్రామంలో సర్పంచ్ నిరజా ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బందితో కలిసి కంటి వెలుగు సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఆధార్‌కార్డుతో కంటి పరీక్షల నిర్వహణ కేంద్రానికి వచ్చేలా గ్రామప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవర్ధన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగును అందరూ కలిసి విజయవంతం చేయాలని గౌతోజీగూడెం గ్రామస్తులు తీర్మానం చేశారు. సోమవారం మండలంలోని గౌతోజీగూడెంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని సర్వేనంబర్ 457లో 74 మంది లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాలకు పొజిషన్‌కై తీర్మానం చేశారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంచమి రేణుకుమార్, ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగరాజుగౌడ్, వార్డు సభ్యులు పెంటమ్మ, భవాని, శ్రీనివాస్, పద్మ, ఆంజనేయులు నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నిబంధనలు ఉల్లంఘించొద్దు



అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ రహదారి నిబంధనలను ఎవరూ ఉల్లంఘించవద్దని కేఎస్ఆర్ పెద్దశంకరంపేట ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పేటలో ప్రజలకు, వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వాహనాలకు వెనకభాగంలో తప్పనిసరిగా సేఫ్టీ రెడ్ స్టిక్కర్‌లు వేసుకోవాలని, జాతీయ రహదారిపై ప్రయాణించే సమయంలో మద్యం సేవించొద్దని అన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఏదైనా అత్యవసర సమయాల్లో 1033కి కాల్ చేయాలని తెలిపారు. రాంగ్ రూట్‌లో వెళ్లడం వల్ల జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అశోక్, ఇన్సిడెంట్ మేనేజర్ ఖాజా మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి మండలం తొలగించాలని కుట్ర



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): నార్సింగి మండలం తొలగించాలని కుట్ర జరుగుతుందని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గోవనర్ధన్ అన్నారు. నార్సింగిలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నార్సింగి మండలంలోని భీంరావ్‌పల్లి గ్రామాన్ని తొలగించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భీంరావ్‌పల్లి గ్రామం నార్సింగి మండలం నుంచి తొలగిస్తే ఊరుకునేది లేదని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీసీసీ నాయకులు యాదగిరి యాదవ్, గొండస్వామి, యాదవ్, ఉపసర్పంచ్ కేశవులు, జానీ, కిషన్, కుర్షిద్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని సలాబత్‌పూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రవీన్‌రెడ్డి భార్య మీనమ్మ(40) సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయం తెలియడంతో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దీంతో పాటు టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ చిన్న చిన్నంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కౌడిపల్లి, చిలిప్‌చెడ్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, అశోక్‌రెడ్డి, ఎంపీపీ డలావత్ రాజునాయక్, కౌడిపల్లి, చిలిప్‌చెడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావ్, నారాయణరెడ్డి, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకులు రాజిరెడ్డి, ఎంపీ విఠల్, మనోహర్‌రెడ్డి, మొగులగౌడ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

నర్సాపూర్: నర్సాపూర్‌లో నిర్మిస్తున్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. సోమవారం పలువురు ఆలయ కమిటీ సభ్యులు రాజుయాదవ్, వెంకటేష్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, శరత్ చంద్ర, రమేశ్‌గౌడ్, పాండు తదితరులు హైదరాబాద్‌లోని ఆయన క్వార్టర్‌కు వెళ్లి శాలువాతో సన్మానించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారం అందిస్తానని గతంలో హామీ ఇచ్చారని, అందులో భాగంగా ఇటీవల దాతల సహకారంతో స్లాబ్ వేయించారని కమిటీ సభ్యులు వివరించారు. కాగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి మరింత సహకారం అందిస్తానని అన్నారు. ఆలయం పూర్తయ్యాక పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఆలయానికి స్థలం ఇచ్చిన స్థల దాత శరత్‌చంద్రను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

ఆకట్టుకున్న జడకొప్పు కోలాటం



జడకొప్పు కోలాటం ఆట ఆడుతున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన కౌడిపల్లి ఎస్సీ కాలనీలో నిర్వహించిన జడకొప్పు కోలాటం ఆట ఆకట్టుకుంది. గ్రామస్తులు పలువురు ఆసక్తిగా తిలకించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి పాటలు పాడుతూ, కోలాటం ఆటలు ఆడుతూ జడకొప్పు ఆట ఆడారు. పెద్దలతో పాటు యువకులు ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆ పార్టీ నాయకులు, బయ్యారం మాజీ ఎంపీటీసీ నర్సింలు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న పథకాలను శ్రీకారం చుడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు చుట్టుపక్కల ప్రక్కల గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించేలా రోడ్లకు మరమ్మతులు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విజయం కోసం సాధన చేయాలి



క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న సీఐ షేక్‌లాల్‌మధార్

నర్సాపూర్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని సీఐ షేక్‌లాల్ మధార్ చెప్పారు. నర్సాపూర్ పోలీసు శాఖ, పట్టణానికి చెందిన సుల్తాన్ క్రికెట్ టీం సంయుక్తంగా ఈనెల 8 నుంచి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఓడిన క్రీడాకారులు నిరాశ చెందకుండా మెలకువలు గుర్తించి, విజయం కోసం సాధన చేయాలని హితవు పలికారు. ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కాగా క్రికెట్ పోటీలో ప్రథమ స్థానం దక్కించుకున్న నర్సాపూర్‌కు చెందిన జీఎస్ఎం సుబ్బు జట్టుకు 32 వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన స్థానిక సేవాలాల్ జట్టుకు 16వేల రూపాయల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మసియొద్దీన్, హజ్జు, జావెద్, షంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



బహుమతులు అందిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా గెలిచిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బీఆర్ఎస్ నాయకులు నారన్నగారి దుర్గారెడ్డి, రామకృష్ణయ్య బహుమతులు, రూ. 3 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత అన్ని రంగాలతో పాటు, క్రీడాల్లో రాణించాలన్నారు. క్రీడలు ఆడే యువకులు ధృఢంగా ఉంటారన్నారు. గెలిచిన విజేతలను అభినందిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామం పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అతిథులు

పాపన్నపేట(మెదక్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం లక్ష్మీనగర్ గ్రామ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 1948లో ఏర్పడిన గ్రామ 75వ పుట్టినరోజు వేడుకలు ప్రగతి సెంటర్‌లో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనురాధ, ఏడు కొండలు, ఎస్ఐ విజయ్, పెంద్యాల ప్రసాద్ కేక్ కట్ చేసి, వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు, ఆట, పాటలతో సందడి చేశారు.

ఆపదలో అండగా

దుబ్బాక: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బిక్కునూరి ఈశ్వరయ్య అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందాడు. దీంతో 15వ వార్డు కౌన్సిలర్ రామస్వామి బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. అనంతరం వారికి 50 కిలోల బియ్యం అందజేశారు.



బియ్యం అందిస్తున్న కౌన్సిలర్ రామస్వామి

కనుల పండువగా గోదా రంగనాథస్వామి కల్యాణం



రామాలయంలో గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

గజ్వేల్‌రూరల్: శ్రీగోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని గజ్వేల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ గోదా రంగనాథస్వామి కల్యాణం నిర్వహించగా, తిరుమల తిరుపతి దేవస్థాన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి అనుమతితో అమరవాది వేంకట నరసింహాచార్య స్వామితో శ్రీగోదాదేవి వైభవ ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు.